క్లుప్తంగా

మాచర్ల సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీరామ్ మనోహర్



మాచర్ల: సబ్ రిజిస్ట్రార్‌గా జె.శ్రీరామ్ మనోహర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. మంగళగిరి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈసందర్భంగా మనోహర్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్‌లో పారదర్శకంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరుగుతాయని చెప్పారు. మనోహర్‌ను పలువురు సిబ్బంది అభినందించారు.

13న జాతీయ లోక్ అదాలత్



సివిల్ జడ్జి శ్రీనివాస్‌కళ్యాణ్

మాచర్ల: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సివిల్ జడ్జి శ్రీనివాస్‌కళ్యాణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, రాజీపడ దగిన కేసులను పరిష్కరించుకునేందుకు కక్షిదారులు సహకరించాలని కోరారు. అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

వందే భారత్ హాల్ట్ కోసం సంతకాల సేకరణ



పిడుగురాళ్ల: వందే భారత్ హాల్ట్ ఇవ్వాలని కోరుతూ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని పట్టణంలో సోమవారం చేపట్టారు. పిడుగురాళ్ల రైల్వే ప్యాసింజర్ అసోసియేషన్ అధ్యక్షులు జూలకంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రైల్వే అధికారులు కృషి చేయాలని తెలిపారు. పట్టణంలోని వందేభారత్ రైలుకు స్టాప్ తప్పనిసరిగా కల్పించాలని కోరారు. అనంతరం స్టేషన్ మాస్టర్ అంజయ్యకు సేకరించిన సంతకాల పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఆలేటి కనకయ్య, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ చల్లగుండ్ల స్వామి, దేవర శ్రీనివాసరావు, బత్తుల వెంకయ్య పాల్గొన్నారు.

నేడు డ్యాన్స్ బేబీ డ్యాన్స్ పోటీలు

మాచర్ల: వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా శ్రీ సీతారామ గణేష్ సేవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం డ్యాన్స్ బేబీ డ్యాన్స్ పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ నిర్వాహకులు ఓరుగంటి పురుషోత్తం, వాసవి దత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.5 వేలు, రెండవ బహుమతి రూ.3 వేలు, మూడో బహుమతి రూ.2 వేలు అందజేయనున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు సీతారామ గణేష్ సేవ కమిటీ నిర్వాహకుల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9030428896, 9490332454 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

నేడు మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

మాచర్ల: స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ మాచర్ల ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ఆర్టీసీ బస్టాండ్ లో ఉచిత కూలింగ్ మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభించనున్నట్లు ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్ హాజరవుతారని చెప్పారు. ఆర్టీసీ డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సహాయం

రెంటచింతల: పేద విద్యార్థిని దేగల మెర్సీకి వైద్యం కోసం ప్రియాంక నర్సరీ, సీడ్స్ అధినేత ఆదూరి ఇన్నారెడ్డి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. స్థానిక అంబేడ్కర్ కాలనీకి చెందిన దేగల థామస్ కుమార్తె మూడో తరగతి విద్యార్థిని దేగల మెర్సీకి శస్త్ర చికిత్స అవసరమైంది. మండల పరిషత్ మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎం లేళ్ల శ్రీనివాసరావు వినతి మేరకు ఇన్నారెడ్డి స్పందించి సాయం అందించారు.

పొలం ఆక్రమించారని ఫిర్యాదు



కారెంపూడి: తమ పొలాన్ని ఆక్రమించారని న్యాయం చేయాలని కోరుతూ కారెంపూడి తండాకు చెందిన రామావతు లక్ష్మీనారాయణ నాయక్ సోమవారం గ్రీవెన్స్‌లో పల్నాడు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. కారెంపూడి తండా సమీపంలో సర్వే నంబరు 807–2లో ఉన్న 2.41 సెంట్ల భూమి ఆక్రమణకు గురైందని పేర్కొంటూ న్యాయం చేయాలని విన్నవించారు.

ఘనంగా వినాయక నిమజ్జనం



వినాయకుని నిమజ్జన కార్యక్రమంలో కోలాటం నిర్వహిస్తున్న భక్తులు



దాచేపల్లిలో వినాయకుడి విగ్రహం నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



గుండ్లపాడు గ్రామంలో గణేష్ నిమజ్జన వేడుక



మాచర్లలో అన్నదానం చేస్తున్న కృష్ణవేణి



మాచర్ల కోదండరామాలయంలో గణనాథుడు



వినాయకుడి వేషధారణలో చిన్నారులు



మాచర్ల 17వార్డులో గణనాథునికి పూజలు

మాచర్ల: పట్టణంలో వినాయక చవితి వేడుకలు ఆరో రోజు ఘనంగా నిర్వహించారు. సోమవారం ప్రత్యేక పూజలు, గణనాథుడనికి పలు రకాల అలంకరణలు, అన్నదాలు నిర్వహించారు. వినాయకుడి నిమజ్జనానికి గణనాథులను ఊరేగింపుగా తరలించారు. బండారు కృష్ణవేణి ఆధ్వర్యంలో రెండు వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శాంతినగర్‌లో అన్నదానం చేశారు. గణనాథునికి యెనుముల కేశవరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

ఉత్సాహంగా..

పిడుగురాళ్ల: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడిని సోమవారం నిమజ్జనానికి తరలించారు. పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. స్వామివారిని మండలంలోని జూలకల్లు గ్రామంలో నిమజ్జనం చేశారు.

దాచేపల్లి మండలంలో..

దాచేపల్లి: వినాయకుడి విగ్రహాల వద్ద సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నగర పంచాయతీ పరిధిలోని మనుషుర్షా పేటలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద కమిటీ సభ్యులు ముశ్యం వెంకటేశ్వర్లు, ముశ్యం శ్రీనివాసరావు, రామాంజనేయులు, ఎర్రబ్బాయి, కొతవరపు శ్రీనివాసరావు, జయదేవ్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. వినాయకుడి విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని కనుల పండువగా జరిపించారు. గామాలపాడు గ్రామపంచాయతీ పరిధిలోని జేపీ సిమెంట్ ఫ్యాక్టరీలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు వినాయకుడి వేషధారణలో ప్రత్యేకంగా కనిపించి సాంస్కృతి కార్యక్రమాలను ప్రదర్శించారు. పలుచోట్ల వినాయకుడి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి కృష్ణా నదిలో నిమజ్జనం చేశారు.

మాచర్ల మండలంలో..

మాచర్ల రూరల్: జై బోలో గణేష్ మహారాజ్‌కి జై అంటూ వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ఊరేగింపు సోమవారం అత్యంత కోలాహలంగా నిర్వహించారు. 13వ వార్డు, పత్తి ఫ్యాక్టరీ వీధిలోని మహిళలు ప్రత్యేక దుస్తులు ధరించి కోలాటం ప్రదర్శన చేస్తూ నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.

వెల్దుర్తి మండలంలో...

వెల్దుర్తి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను సోమవారం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. గుండ్లపాడులో బొడ్రాయి సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయక లడ్డూ పాట గోపతి రాంబాబు రూ.21 వేలకు, చిన్న లడ్డూను సాని శ్రీనివాసరావు రూ.6,500లకు దక్కించుకున్నారు. వినాయక విగ్రహం ఊరేగింపు, ఉచిత అన్నదానం నిర్వహించి ఆనందోత్సవాల మధ్య భక్తులు గులాంలు చల్లుకొని నృత్యాలు చేస్తూ నిమజ్జన కార్యక్రమానికి తరలించారు. మండలంలోని వినాయక విగ్రహాలను మరసపెంట వద్ద నున్న కృష్ణానదికి తరలించి ఇక్కడ నిమజ్జన కార్యక్రమాలు పూర్తి చేశారు.

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన వైఎస్సార్ చిత్రపటం



గణేష్ నిమజ్జనంలో దివంగత వైఎస్సార్, నాయకులు చిత్రపటాలు ఊరేగింపు చేస్తున్న దృశ్యం

మాచర్ల రూరల్: జై జై గణేశా.. జై జై వినాయక.. జోహార్ వైఎస్సార్.. జోహార్ పీఎల్ఆర్, జోహార్ పీఎస్ఆర్ అంటూ గణేష్ నిమజ్జన వేడుకల్లో వారి పేర్లు మార్మోగిపోయాయి. పిన్నెల్లి సుందరరామిరెడ్డి వీధిలో వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన గణేష్ నిమజ్జన వేడుకల్లో దివంగత మహానేత వైఎస్సార్ చిత్రపటంతో పాటు మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకుడు పిన్నెల్లి సుందరరామిరెడ్డి ఫొటోలను విగ్రహం ముందు ఏర్పాటు చేసి వారి కుటుంబ సభ్యులు, వారి అభిమానాన్ని చాటుకున్నారు.



పిడుగురాళ్లలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు



నారాయణపురంలో వినాయకుడి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

పల్లెల్లో ఎక్కడి సమస్యలు అక్కడే..



దాచేపల్లి రోడ్డు సమీపంలో బురదమయంగా ఉన్న దారి



ఎస్సీ కాలనీలో డ్రెయినేజీలో పేరుకున్న వ్యర్థాలు

కారెంపూడి: కారెంపూడి మేజర్ పంచాయతీలో శివారు కాలనీలలో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. దాచేపల్లి రోడ్డు నుంచి మాజీ సర్పంచి కంపా నాగరాజు ఇంటి బజారును కలిపే రోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. అక్కడ డ్రెయినేజి నీరు రోడ్డుపైనే పారుతోంది. అలాగే ఎస్సీ కాలనీలో సైడు కాల్వల నిండా చెత్త పేరుకుపోయింది. దీంతో వర్షాకాలంలో ఉండే దోమలు ఇంకా బాగా ప్రబలాయి. పంచాయతీ పాలక వర్గం బాగా బురదమయంగా మారిన రోడ్లకు మట్టి తోలించి సైడు కాల్వలు తీయించి అలాగే దోమల నివారణ మందు పిచికారి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

జీవిత బీమాతో భద్రత



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నాగేంద్రబాబు, డెవలప్‌మెంట్ అధికారులు

మాచర్ల: జీవిత బీమా వారోత్సవాలు స్థానిక ఎల్ఐసీ శాటిలైట్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. బ్రాంచి మేనేజర్ నాగేంద్రబాబు జ్యోతి ప్రజ్వలన చేశారు. నాగేంద్రబాబు మాట్లాడుతూ ప్రైవేట్ సంస్థలను నమ్మవద్దని, గత 68 సంవత్సరాల నుంచి ఎల్ఐసీ పాలసీ దారులకు సేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందన సంస్థ అన్నారు. 14 దేశాల్లో మొత్తం 2048 బ్రాంచిలు, 91,606 మంది ఉద్యోగస్తులు, 14,86,851 మంది ఏజెంట్స్, తమ వ్యాపార దక్షతతో సంపాదించిన మొత్తం నిఖర ఆస్తులు రూ.56,22,929.99 కోట్లు కాగా, లైఫ్ ఫండ్ 47,84,941.86 కోట్లు, ప్రీమియం పై ఆదాయం 4,88,148.17 కోట్లని, మొత్తం క్లయిమ్స్ 229.31లక్షలు ఇస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డెవలప్మెంట్ ఆఫీసర్లు బి.కొండా నాయక్, వి.సత్యనారాయణ, ఇ.మారుతీరావు, రామావత్ బిచ్చాలు నాయక్, ఏజెంట్లు కేపీ సిద్ధమరాజు, పోలా ప్రసాద్ రావు పందిరి శ్రీనివాసరావు, ఓరుగంటి చెన్నకేశవరావు, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తహసీల్దార్ కరుణకుమార్ బాధ్యతలు స్వీకరణ



కరుణకుమార్‌ను శాలువతో సన్మానిస్తున్న దృశ్యం

దుర్గి: మండల తహసీల్దార్‌గా జి.కరుణకుమార్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ప్రత్తిపాడు నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు మాచర్ల తహసీల్దార్ బి.కిరణ్‌కుమార్ ఇన్‌చార్జి అదనపు బాధ్యతలు చూశారు. కరుణకుమార్‌ను పలువురు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ పల్నాటి ప్రాంతంలో గతంలో పని చేసిన అనుభవం దృష్ట్యా ప్రజలకు మరింత సేవ చేయటానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

పాఠశాల ప్రహరీ ప్రారంభం



రెంటచింతల: మండలంలోని రెంటాల ఎస్సీ కాలనీ ఎంపీయూపీ పాఠశాల ప్రహరీని ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. బీజేపీ యువ నాయకుడు ఇగుటూరి రాజశేఖరరెడ్డి రూ.లక్ష ఆర్థిక సాయంతో ప్రహరీ నిర్మించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం దాత రాజశేఖరరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 వై.శివ నాగేశ్వరరావు, స్కూల్ హెచ్ఎం శిరీష, స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ నరేష్, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం భారతి, ఇగుటూరి సత్యనారాయణరెడ్డి, చేర్రెడ్డి కోటిరెడ్డి, ఉపాధ్యాయులు కిరణ్, రాజుకుమార్, బుచ్చిరెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.

నేడు దివంగత వైఎస్సార్ వర్ధంతి

పిడుగురాళ్ల: పట్టణంలో దివంగత రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని మంగళవారం పట్టణంలోని అన్ని వార్డులలో నిర్వహించాలని వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ మాదాల కిరణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. ఉదయం 9.15 గంటలకు పిడుగురాళ్ల పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం దగ్గర వైఎస్సార్ విగ్రహం వద్ద, 9.30 గంటలకు పట్టణంలోని అంజిరెడ్డి హాస్పటల్ ఎదురు ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద, 9.45కు పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో వైఎస్సార్ వర్ధంతి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మాచవరం మండలంలో...

మాచవరం మండలం పిల్లుట్ల గ్రామంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద వర్ధంతి నిర్వహించనున్నారు. అనంతరం 11 గంటలకు మాచవరం మండలంలోని అమర్ ఫంక్షన్ హాల్‌లో బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు.

కారెంపూడి మండలంలో..

కారెంపూడి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని మంగళవారం నిర్వహించడానికి వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం మండలంలో వైఎస్సార్ విగ్రహాలను శుభ్రం చేసే కార్యక్రమాలు జరిగాయి. కారెంపూడి కోట బురుజు వద్ద ఉన్న విగ్రహం వద్ద 17వ వర్ధంతిని నిర్వహించి మహానేతకు ఘన నవాళులర్పించేందుకు పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్, పట్టణ పార్టీ అధ్యక్షుడు బొమ్మిన అల్లయ్య, మండల యువజన విభాగం అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, కిల్లా కాశి పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేస్తున్నాం

హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనిత



సమావేశం ప్రారంభం కాగానే వెనుదిరిగిన మహిళలు

పిడుగురాళ్ల: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ అమలు చేస్తోందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలో స్త్రీశక్తి పథకం విజయోత్సవ బహిరంగ సభ సోమవారం నిర్వహించారు. సభకు పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. హోం శాఖ మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేస్తున్నామన్నారు.

సమావేశం ప్రారంభంలోనే వెనుదిరిగి మహిళలు...

సమావేశం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైంది. చీకటి పడుతుండటంతో మహిళలు సమావేశం ప్రారంభం అవుతుండగానే వెనుదిరిగి వెళ్లారు. అలాగే సమావేశానికి హాజరైన మహిళలకు బిస్కెట్లు, మంచినీళ్ల లారీలలో అందించే కార్యక్రమం నిర్వహించారు. తోపులాటు చోటుచేసుకుంది. ప్రైవేటు పాఠశాలలకు చెందిన బస్సులలో మహిళలను తరలించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. జానపాడు రోడ్డులో బహిరంగ సభ సమావేశం నిర్వహించటంతో జానపాడు, కారెంపూడి వెళ్లే దారి పూర్తిగా స్తంభించి పోయింది. ర్యాలీ నిర్వహించి ప్రయాణికుల రాకపోకలకు కూడా తీవ్ర అంతరాయం కలిగింది. సమావేశానికి నియోజకవర్గంలోని డ్వాక్రా మహిళలు అత్యధిక సంఖ్యలో హాజరయ్యారు.

విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ఉండాలి

ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణ



సత్రశాలలో వినాయకుని నిమజ్జనంలో పాల్గొన్న విద్యుత్ అధికారులు

సత్రశాల(రెంటచింతల): విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ఉంటే శుభం జరుగుతుందని స్థానిక ఏపీ జన్‌కో నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఎస్ఈ వెంకట రమణ అన్నారు. సోమవారం స్థానిక నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుని నిమజ్జన యాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వినాయకుడికి పూజలు చేస్తే ఆ కుటుంబానికి ఎంతో మంచి జరుగుతుందన్నారు. మనం ఏ కార్యాన్ని తలపెట్టిన ముందుగా ఆ విఘ్నేశ్వరుడిని తలుచుకుంటామన్నారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై వినాయక విగ్రహంను ప్రతిష్టించి గులాములు చల్లుకుంటూ భారీగా బాణసంచా కాలుస్తూ, మేళతాళాలతో ఉత్సాహంగా... ఉల్లాసంగా కేరింతలు కొడుతూ నిమజ్జన ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఈఈ సుబ్రహ్మణ్యం, జీఎం శ్రీనివాస్, ఏడీఈ జయచంద్ర, ఏఈలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన మిర్చినారు అందించాలి



మిర్చి మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖ అధికారి మోహన్

రెంటచింతల: రైతులకు ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీలకు చెందిన నాణ్యమైన మిర్చినారు అందించాలని గురజాల ఉద్యాన శాఖ అధికారి వై.మోహన్ అన్నారు. సోమవారం రెంటచింతలలోని పలు నర్సరీలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్వాహకులకు మిర్చినారు పెంపకంపై అవగాహన కల్పించారు. ఉద్యానశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్టాక్ రిజిస్టర్, ప్రొడక్షన్ అండ్ సెల్స్ రిజిస్టర్, నర్సరీ మెయింటెనెన్స్ రికార్డులలో మొక్కల పెంపకం, క్రయవిక్రయాలకు సంబంధించిన పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. మొక్కలను విక్రయించేటప్పుడు ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని అందులో విత్తనం రకం, కంపెనీ పేరు, లాటు నెంబర్, మొక్కల సంఖ్య, ధరను నమోదు చేయాల్సి ఉందన్నారు. నర్సరీ నిర్వహకులు మొత్తం 7 రికార్డులను మెయింటైన్ చేయాలని కోరారు. రైతులకు వారు అడిగిన కంపెనీలకు చెందిన మిర్చినారును మాత్రమే అందజేయాలని... నాసిరకం నారును విక్రయించిన నర్సరీ నిర్వహకులైన యజమానులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అనుమతి లేకుండా మిర్చినారును విక్రయించిన శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అలా చేయని వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నర్సరీల నిర్మాణ, నిర్వహణ సమయాలలో ఉద్యానశాఖ అధికారుల సూచనలు, సలహాలు తీసుకున్నట్లు అయితే తక్కువ ఖర్చుకే రైతులకు నాణ్యమైన మొక్కలను అందించవచ్చునన్నారు. షేర్ నెట్ పై పలుచూచనలు చేశారు. నర్సరీ రిజిస్ట్రేషన్ కొరకు పాటించవలసిన నియమ నిబంధనలను వివరించారు. ఆయన వెంట ఉద్యానశాఖ సహాయకులు పవన్ కిశోర్, నర్సరీ నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

80 శాతం పింఛన్లు పంపిణీ



పింఛను అందజేస్తున్న మాచర్ల మున్సిపల్ కమిషనర్ వేణుబాబు

మాచర్ల: పట్టణంలో పింఛన్లు పంపిణీ సోమవారం నిర్వహించారు. పదో వార్డులోమున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు పాల్గొని పింఛన్లు అందజేశారు. సచివాలయ ఉద్యోగులు ఉదయం నుంచి పింఛన్లు పంపిణీ చేశారు. 80 శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేశారు.

కారెంపూడి: పింఛన్ల పంపిణీ కార్యక్రమాలు సోమవారం మండలంలోని అన్ని గ్రామాలలో కొనసాగాయి. తెల్లవారు జామునుంచే పింఛన్లను ఉద్యోగులు ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య కాచవరం గ్రామంలో జరిగిన పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.